www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 2 జనవరి 2025 5 ఏలూరు



విభిన్న ప్రతిభావంతులకు పెట్రోల్ రాయితీ

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో శారీరక వైకల్యం కలిగి ఉండి, సొంత వ్యాపారంగాని, ఏదేని గుర్తింపు పొందిన ప్రయివేటు సంస్థల్లోగాని పని చేస్తూ మూడు చక్రాల మోటారు వాహనం కలిగి ఉన్న విభిన్న ప్రతిభావంతులు పెట్రోలు రాయితీకి దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు దరఖాస్తుదారులు వారు పూర్తి చేసిన దరఖాస్తు ఫారంతోపాటు వారి సదరం ధ్రువీకరణ పత్రం, పెట్రోల్ కొనుగోలు చేసిన బిల్లులు, బిపిఎల్ రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ పాస్‌బుక్ మొదటి పేజీ, ఆధార్ కార్డు, వ్యాపారం లేదా ప్రయివేటు సంస్థలో పని చేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో తమ కార్యాలయంలో అందజేయాలని కోరారు. జిల్లాలోని అర్హులైన విభిన్న ప్రతిభావంతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



కోరె ఢీ

- సంక్రాంతికి పందెంరాయుళ్లు సిద్ధం
- ఇప్పటికే ఊరువాడా చిన్నపాటి పందేలు ప్రారంభం
- పోలీసుల మాటలకు.. చేతలకు పొంతన కరువు
- గతేడాది రెండు జిల్లాల్లో 400కుపైగా బరుల్లో పందేల హోరు
- గుండాట, మూడు ముక్కలాట షురూ అంటున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సంక్రాంతి పండుగ మూడు రోజులు విచ్చలవిడిగా కోడిపందేలు నిర్వహించేందుకు పందెంరాయుళ్లు ప్రణాళికలతో రెఢీ అవుతున్నారు. ఎక్కడెక్కడ బరులు ఏర్పాటు చేయాలి. ఎలాంటి ఏర్పాట్లు చేయాలనే దానిపై తర్జనభర్జనలు సాగుతున్నాయి. గతానికంటే భిన్నంగా ఈసారి సంక్రాంతి నెల ప్రారంభం నుంచే రెండు జిల్లాల్లోనూ కోడిపందేల జోరు సాగుతోంది. ప్రతిరోజూ అనేక నియోజకవర్గాల్లో విచ్చలవిడిగా కోడిపందేలు సాగుతున్నాయి. భీమవరం, ఉండి నియోజకవర్గాలతోపాటు ఇతర ప్రాంతాల్లోనూ పందేల జోరు పెద్దఎత్తున సాగుతోంది. ఏలూరు జిల్లాలోనూ అదే పరిస్థితి నెలకొంది. తూతూమంత్రంగా దాడులు నిర్వహించడం తప్ప కోడి పందేలను అరికట్టడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఇప్పటికే రెచ్చిపోయి పందేలు నిర్వహిస్తున్న పందెంరాయుళ్లు పండుగ మూడు రోజులూ అడ్డూఅదుపు లేకుండా పందేలు నిర్వహించాలనే యోచనలో ఉన్నారు. పందేలకు అడ్డుకట్ట వేస్తామంటూ పోలీసులు ఎప్పటిలానే బీరాలు పలుకుతున్న పరిస్థితి ఉంది. పండుగ మూడు రోజులు జిల్లాలో జరిగే కోడిపందేలతో ఎన్నో సామాన్య కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతింటున్నాయి. అయినప్పటికీ సంప్రదాయం పేరుతో ప్రభుత్వం అనధికారికంగా కోడి పందేలకు అనుమతులిస్తూ జూద క్రీడను ప్రోత్సహిస్తూనే ఉంది. కోడి పందేలను అడ్డుకోవాలంటూ న్యాయస్థానాలు స్పష్టమైన తీర్పులిచ్చినా పట్టించుకోని పరిస్థితి ఉంది. కొంతమందిపై బైండోవర్ కేసులు, ఒకటి, రెండు చోట్ల దాడులు నిర్వహించి కోర్టులను సైతం అధికారులు తప్పుదోవ పట్టిస్తున్న పరిస్థితి ఉంది. దీంతో ఈ ఏడాదిసైతం పెద్దఎత్తున కోడిపందేలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ సాగుతున్నాయి. పందెంరాయుళ్లంతా తమ కోళ్లకు తర్ఫీదునిస్తూ పందేలకు సిద్ధం చేస్తున్నారు. జీడిపప్పు, పిస్తా వంటి బలవర్ధకమైన ఆహారం పందెం కోళ్లకు పెడుతున్నారు. రూ.వేలు, లక్షలు చెల్లించి పందెం పుంజులను కొనుగోలు చేస్తున్నారు.

ప్రతియేటా రూ.కోట్లలో పందేల జోరు

ప్రతియేటా పండుగ మూడు రోజులు రెండు జిల్లాల్లో చిన్నా, చితకా దాదాపు 400 బరుల్లో కోడిపందేలు సాగుతున్నాయి. భీమవరం చుట్టుపక్కల, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, దెందులూరు, జంగారెడ్డిగూడెం వంటి పలు ప్రాంతాల్లో భారీఎత్తున కోడిపందేలు సాగుతాయి. ఒక్కో పందేనికి రూ.లక్షల్లో బెట్టింగులు సాగుతాయి. పండుగ మూడు రోజుల్లో రెండు జిల్లాల్లో రూ.200 కోట్లు మేర బెట్టింగ్‌లు జరుగుతున్నట్లు అంచనా. ఈ ఏడాది అంతకు మించి పందేల జోరు సాగే అవకాశం ఉందని పందెంరాయుళ్లు అంచనా వేస్తున్నారు. బరుల వద్ద పార్కింగ్ స్థలాలు, టెంట్లు వంటి ఏర్పాట్లపై నిర్వాహకులు ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నారు. బరుల వద్ద మద్యం అమ్మకాలు, మూడు ముక్కలాట, గుండాట సైతం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేసుకుంటున్నారు. కోడిపందేల విష సంస్కృతి ఏయేటికాయేడు పెరుగుతుందే తప్ప ఏమాత్రం తగ్గడం లేదు. ఎంఎల్ఎ, మాజీ ఎంఎల్ఎలు, మంత్రులు సైతం ఈ పందేల్లో పాల్గొనడంతో పోలీసులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. కోడి పందేలను అరికట్టేందుకు తహశీల్దార్, ఎస్ఐ ఆధ్వర్యంలో మండల కమిటీలను నియమిస్తున్నా ఏమాత్రం ప్రయోజనం లేకుండాపోతుంది. పండుగకు ముందు కోడి పందేలను అరికడతామని పోలీసులు హడావుడి చేయడం, ఆ మూడు రోజులూ చేతులెత్తేయడం పరిపాటిగా మారింది. ఈ ఏడాదైనా కోడి పందేలను అడ్డుకోవాలని జనం ప్రభుత్వాన్ని కోరుతున్నారు

పేదల ఆకలి తీర్చడమే అన్న క్యాంటీన్ల లక్ష్యం

భోజనం రుచి చూసిన మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. బుధవారం స్థానిక అన్న క్యాంటీన్‌ను మంత్రి సందర్శించి పేదలతో కలిసి భోజనం చేశారు. వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అన్న క్యాంటీన్‌లో పేదలకు ఆయన స్వయంగా భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదలకు కడుపునిండా అన్నం పెట్టడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను ప్రారంభించారన్నారు. పట్టణాలకు వైద్యం, విద్య వంటి పనుల కోసం ఎంతోమంది సామాన్యులు వస్తుంటారని, వారు అర్ధాకలితో అలమటించకుండా అన్న క్యాంటీన్లు కడుపు నింపుతున్నాయన్నారు. మంత్రి వెంట పలువురు స్థానిక నాయకులు, ప్రముఖులు ఉన్నారు.




భోజనాలు వడ్డిస్తున్న మంత్రి పార్థసారథి

ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

నియోజకవర్గ ప్రజల సౌకర్యార్థం నూతన క్యాంపు కార్యాలయన్ని ఏర్పాటు చేసినట్లు పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు తెలిపారు. బుధవారం బర్రింకలపాడులోని తన స్వగృహం పక్కనే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ నలుమూలల నుంచి పలువురు ప్రముఖులు, అధికారులు, సిబ్బంది ఎంఎల్ఎను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు, నాయకులు గడ్డమణుగు రవికుమార్, పి.రాము, నియోజకవర్గ పరిధిలోని కూటమి నాయకులు పాల్గొన్నారు.



కార్యాలయం ప్రారంభిస్తున్న నేతలు

అల్లూరి స్ఫూర్తితో పోరాటాలు

- ఉద్యమాలే ఊపిరిగా సిపిఎం
- ప్రజల్లో చైతన్యానికి నిత్య ప్రచారం
- దీర్ఘకాలిక ఉద్యమాల ఫలితాలతో శ్రేణుల్లో నూతనోత్సాహం
- సమరశీల పోరాటాలతో ముమ్ముందుకు
- 3, 4, 5 తేదీల్లో భీమవరంలో సిపిఎం జిల్లా మహాసభ



ప్రజాశక్తి - భీమవరం

ఉద్యమాల రథసారధి సిపిఎం పోరాటాలే ఊపిరిగా ముందుకు సాగింది. దీర్ఘకాలిక ఉద్యమాలు ఫలితాలను ఇవ్వడంతో పార్టీ శ్రేణుల్లోనూ స్ఫూర్తిని నింపాయి. మిలిటెంట్ పోరాటాలతో ముందుకెళ్తూ ప్రభుత్వ నిర్బంధాలను ఎదుర్కొంటూ ప్రజా పక్షాన నిలిచి పేదల గొంతుకగా నిలిచింది. ఈ మూడేళ్ల కాలంలో సిపిఎం నిర్వహించిన పోరాటాలు అమోఘం. అధికారంలో ఉంటే అందలం, అధికారం లేకుంటే ఇంటికే పరిమితమయ్యే బూర్జువా పార్టీలను చూస్తుంటాం. అయితే అధికారమున్నా, లేకున్నా ప్రజా సమస్యలే నాడిగా, ఉద్యమాలే ఊపిరిగా సిపిఎం పోరాటాలు చేసింది.

ప్రభుత్వాలు, పాలకులు అవలంబిస్తున్న విధానాలతో పచ్చని పశ్చిమగోదావరి జిల్లాలో అభివృద్ధి తీరు నత్తతో పోటీ పడుతోంది. అపారమైన వనరులు, నిక్షేపాలు పుష్కలంగా ఉన్నప్పటికీ వాటిని ఉపయోగించుకోవడంలో తీవ్ర నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారు. ఇది కార్మిక, కర్షక జీవన ప్రమాణాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లతోపాటు సామాన్య ప్రజానీకం అంతా అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యమాలే ఊపిరిగా నిరంతరం ప్రజలకు అండగా నిలుస్తున్న సిపిఎం ప్రజా సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటాలు సాగిస్తోంది. ఈ మూడేళ్ల కాలంలో జిల్లాలో సిపిఎం పోరాటాలు విస్తరించాయి. జిల్లావ్యాప్తంగా ప్రజా సమస్యలపై పెద్దఎత్తున ఉద్యమాలు సాగించింది. అనేక సమస్యల పరిష్కారానికి మార్గనిర్దేశకునిగా సిపిఎం ముందుండి ప్రజలకు అందని ద్రాక్షగా ఉన్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు, ఉపాధి కల్పనకు నిర్విరామ కృషి సాగించింది. జిల్లావాసులను పట్టిపీడిస్తున్న కాలుష్య భూతానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు సాగించింది. రైతు, పేద రైతు, కౌలురైతు సమస్యలపై సాగిన ఉద్యమాలకు అండగా నిలిచింది. జిల్లాలో ఆక్వా నుంచి ఆదాయం పొందే ప్రభుత్వాలు ఆక్వా రైతుల సమస్యలను మాత్రం గాలికొదిలేసింది. సీడ్, ఫీడ్ ధరలు తగ్గించాలని, విద్యుత్ రాయితీలను కొనసాగించాలని సాగిన పోరాటాలకు మద్దతుగా నిలిచింది. పేదల ఇళ్లు, ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్లు అందించకపోవడంతో లబ్ధిదారులు అప్పుల పాలై వడ్డీలు కూడా కట్టలేని పరిస్థితి ఏర్పడింది. అంతేకాక సొంతిల్లు లేక అద్దె ఇళ్లలో తల దాచుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా వేలాది మందితో ఆయా ప్రాంత ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడించడంతో ప్రభుత్వం కొంత కదలిక వచ్చింది. వ్యవసాయ కార్మికులకు అండగా నిలిచిన ఉపాధి హామీకి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో సరైన కేటాయింపులు చేయకపోవడంతో బిజెపి తీరును నిరసిస్తూ పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించారు.


3 నుంచి సిపిఎం జిల్లా మహాసభ

చారిత్రాత్మక ప్రాంతమైన భీమవరంలో ఈ నెల 3, 4, 5 తేదీల్లో సిపిఎం జిల్లా మహాసభ జరగనుంది. ఈ మేరకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. మూడో తేదీన అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి ముగింపు సందర్భంగా భీమవరం పట్టణంలో భారీ ప్రజా ప్రదర్శన నిర్వహించనున్నారు. అదేరోజు భారీ బహిరంగ సభ నిర్వహణకు సన్నాహాలు సాగుతున్నాయి. మహాసభకు ఎంపికైన ప్రతినిధులతోపాటు హాజరయ్యే ప్రజానీకం వేలాది మందితో అల్లూరికి ఘనంగా నివాళులు అర్పించనున్నారు. 4, 5 తేదీల్లో ప్రతినిధుల సభ జరగనుంది. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మంతెన సీతారాం హాజరు కానున్నారు. ప్రతి మూడేళ్లకోసారి సిపిఎం గ్రామస్థాయి నుంచి అఖిల భారతస్థాయి వరకు మహాసభలు నిర్వహించి, ఈ మూడేళ్ల కాలంలో సాగించిన పోరాటాల కృషిని సమీక్షించుకుని భవిష్యత్తులో చేపట్టే ప్రజా పోరాటాల సన్నద్ధతకు కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన చేయనున్నారు.

నూజివీడు బాలోత్సవం లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు బాలోత్సవం లోగోను బుధవారం సాయంత్రం ఆవిష్కరించారు. స్థానిక ఎన్‌జిఒ హోమ్ ఆవరణలో డివైఎఫ్ఐ ఎం.సేవియానాయక్ చేతల మీదుగా ఈ ఆవిష్కరణ చేశారు. కార్యక్రమం లో బాలోత్సవం కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బివిబి.కోటేశ్వరి, కె.గాంగేయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ శిఖా ఆకాష్, గౌరవ కార్యదర్శి ఎన్.స్ఫూర్తి, కమిటీ సభ్యులు డాక్టర్ శ్యామ్, డి.మోహన రావు, బి.అనూరాధ, ఎ.బాలు, ఎస్‌కెడి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 30న నూజి వీడు బాలోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.



బాలోత్సవం లోగో ఆవిష్కరిస్తున్న డివైఎఫ్ఐ ఎం.సేవియానాయక్

బుల్లెట్ బండిపై ఎస్‌పి బీట్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ బుల్లెట్ బండిపై పెట్రోలింగ్ చేసి నూతన ఒరవడిని సృష్టించారు. నగరంలో నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని ప్రత్యేక బీట్లను, ప్రత్యేక బందోబస్తులను, ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసేందుకు ఎస్‌పి ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం రాత్రి 11.30 గంటల నుంచి నగరంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు స్వయంగా ఎస్‌పి ప్రతాప్‌శివ కిషోర్ రంగంలోకి దిగారు. సిబ్బంది, అధికారులతో కలిసి ఆయన బుల్లెట్ వాహనంపై ఏలూరు నగరంలో అర్ధరాత్రి రెండు గంటల వరకు బీట్ నిర్వహించారు. ఆయన ముందు ద్విచక్రవాహనాన్ని నడుపుతూ వెళ్తుంటే వెనుక మిగిలిన సిబ్బంది కూడా సైరన్ల మోత మోగిస్తూ నగరాన్ని చుట్టేశారు. ఎస్‌పి రాత్రివేళ శాంతిభద్రతలను కాపాడేందుకు తీసుకున్న చర్యల్లో భాగంగా స్వయంగా ద్విచక్రవాహనంపై పోలీసులు చేయడంతో ప్రజలు ఎస్‌పి పొగడ్తలతో ముంచేశారు. ఒకపక్క శాంతి భద్రతలను కాపాడుతూనే మరోపక్క నగరంలోని ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

16 ఏళ్ల సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

గత 16 ఏళ్ల నుంచి నూజివీడు ఆర్‌జియుకెటి క్యాంపస్‌లో నెలకొన్న ఎస్‌టిపి వాటర్ డిస్పోసల్ సమస్యకు పరిష్కారం దొరికింది. ఆర్‌జియుకెటి క్యాంపస్ నుంచి నూజివీడు మున్సిపాలిటీ కళింగా కెనాల్ వరకు భూగర్భ పైపులైను వేసేందుకు అనుమతులు లభించాయి. నూజివీడు మున్సిపల్ కమిషనర్ ఈ పనికి సంబంధించిన వర్క్ ఆర్డర్‌ను విజయవాడ వారికి అప్పగించారు. దీంతో ఎంతో కాలంగా ఆర్‌జియుకెటి పరిసర ప్రాంతాల్లో ఉన్న గ్రామాలు ఎదుర్కొంటున్న సమస్య త్వరలో శాశ్వతంగా పరిష్కారం కానుంది. దీనికి సంబంధించిన పైపులైన్ పనిని త్వరలో ప్రారంభించనున్నట్లు ఆర్‌జియుకెటి డైరెక్టర్, ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్, ఎఒ బి.లక్ష్మణ్ తెలిపారు.

పట్టుదలతో కృషి చేసి విజయం సాధించండి

డిఎస్‌సి అభ్యర్థులతో ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - దెందులూరు

డిఎస్‌సి అభ్యర్థులు పట్టుదలతో కృషి చేసి విజయం సాధించాలని, అదే తన ఆకాంక్ష అని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఏలూరులోని కెపిడిటి ఆడిటోరియంలో చింతమనేని ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న మెగా డిఎస్‌సి వంద రోజుల ఉచిత శిక్షణ శిబిరం కార్యక్రమంలో అభ్యర్థులకు ఆయన బుధవారం ఉచితంగా స్టడీ మెటీరియల్స్ అందించారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శిక్షణ శిబిరానికి విచ్చేసిన ఆయనకు అభ్యర్థులు ఘన స్వాగతం పలికారు. జనవరి మూడో తేదీన జరగనున్న ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని చింతమనేని ప్రభాకర్ ఫేస్ మాస్కులు ధరించిన అభ్యర్థులు ప్రత్యేకంగా ముందస్తు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శిబిరంలో శిక్షణ అధ్యాపకులు మురళీ మాస్టర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ఇటువంటి అత్యుత్తమ స్థాయి ప్రమాణాలు కలిగి ఉచితంగా మెగా డిఎస్‌సి శిక్షణను అందిస్తున్న శిబిరాన్ని తాను ఎక్కడా చూడలేదన్నారు. ఉన్నత భావాలు కలిగిన కుటుంబంలోని వ్యక్తులకు ఇటువంటి ఉన్నత ఆశయాలు కలుగుతాయన్నారు. దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ చేస్తున్న ఈ మహోన్నత యజ్ఞం ఎంతోమంది నిరుద్యోగుల జీవితాల్లో ఉద్యోగ జ్యోతిని వెలిగించబోతుందన్నారు. ఎంతో సేవా దృక్పథంతో చింతమనేని ప్రభాకర్ అమలు చేస్తున్న ఈ శిక్షణా శిబిరాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకుని విజయం సాధించాలని సూచించారు. అనంతరం ఎంఎల్ఎ చింతమనేని శిక్షణ శిబిరంలోని అభ్యర్థులకు ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో పాల్గొని స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ శిబిరం పర్యవేక్షకులు కడియాల కృష్ణారావు, ప్రముఖ ఫ్యాకల్టీ మురళీ మాస్టర్, టిడిపి సీనియర్ నాయకులు ఉప్పలపాటి రాంప్రసాద్, టిడిపి పెదవేగి మండలాధ్యక్షులు బొప్పనా సుధ, తదితరులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ఆదివాసీ చట్టాలు, జీవన విధానం పుస్తకాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఆదివాసీ చట్టాలు, జీవన విధానం పుస్తకాలను బుధవారం ఆవిష్కరించారు. మండలంలోని జైనవారిగూడెం గ్రామానికి చెందిన కొవ్వాసి సూర్యప్రకాష్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం విలువైన సూచనలు చేస్తూ, నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. జైనవారిగూడెంలో ఆయన స్వగృహం వద్ద సూర్యప్రకాష్‌ను ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆదివాసీ చట్టాలు, జీవన విధానం, అమలు వంటి పుస్తకాలను ఆవిష్కరించారు. సూర్యప్రకాష్‌ను కలిసిన వారిలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, ఉపాధ్యక్షులు పోలోజు నాగేశ్వరరావు, కారం భాస్కర్, గ్రామ నాయకులు తాటి రాంబాబు, మడివి రాజు, తాటి అన్నపూర్ణ, తదితరులు ఉన్నారు.



పుస్తకం ఆవిష్కరిస్తున్న సూర్యప్రకాష్, ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- గుట్టలుగా పోసి అధిక ధరలకు విక్రయాలు
- పట్టించుకోని పోలీసులు, రెవెన్యూ అధికారులు
- స్థానిక నాయకుల తీరుపై ప్రజల విమర్శలు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుంది. అయినా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఇచిత ఇసుక పాలసీ అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో తమకు మేలు జరుగుతుందని ఇల్లు నిర్మించుకునే పేదలు అనుకున్నారు. కాని మండలంలోని పలు గ్రామాల్లో కొంతమంది ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఇసుకను బయటకు తోలడం లేదా ఒకచోట గుట్టగా పోసి విక్రయించడం వంటివి చేస్తున్నారు. ట్రాక్టర్ ఉన్న ప్రతిఒక్కరూ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. మండలంలోని వలసపల్లి, ఎల్లాపురం, గుళ్లపూడి, లోపూడి గ్రామాల్లోని తమ్మిలేరు ఇసుకను నూజివీడు నియెజకవర్గం పరిధి దాటి ఏలూరు, విసన్నపేట, హనుమాన్ జంక్షన్ వంటి ప్రాంతాలకు తోలుతున్నారు. లేదా పెద్దపెద్ద గుట్టలగా పోసి అధికమొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో అవసరమైనవారికి భవిష్యత్తులో ఇసుక దొరికే పరిస్థితి ఉండదని, తమ్మిలేరు పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు వాపోతున్నారు. ప్రతిరోజు సుమారు ఒక్కోక్క రిచ్ నుంచి 200 ట్రిప్పులు తోలకాలు జరుగుతున్నాయని వాపోతున్నారు.

అధికంగా సొమ్ము వసూలు

రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఇసుక రిచ్‌ను లాంఛనంగా ప్రారంభించిన సమయంలో ట్రాక్టర్ లోడ్ చేసేందుకు ముఠా కూలీ రూ.400 నిర్ణయించారు. అయితే కొన్ని రీచ్‌ల్లో ఇసుక లోడ్ చేసేందుకు స్థానిక నాయకులు రూ.500, 600 కూడా వసూలు చేస్తున్నారు. గ్రామాభివృద్ధికి అంటూ అధికంగా వంద రూపాయాలు వసూలు చేస్తున్నారని ట్రాక్టర్ డ్రైవర్లు చెబుతున్నారు. ఈ లెక్కన ఒక్క గ్రామంలోనే రోజుకు 200 ట్రిప్పులు చొప్పన ఒక్క రోజుకే రూ.20 వేలు వసూలు అవుతున్నాయి. పోలీస్, రెవెన్యూ శాఖాధికారులు మాత్రం ఉచిత ఇసుక పాలసీ అమల్లో ఉందని చెబుతున్నారే తప్ప నాయకులకు ఎదురు చెప్పడంలేదు. దీనిపై వారు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక రవాణాపై పూర్తిస్థాయి పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.




ఇసుక రీచ్‌లో ఉన్న ట్రాక్టర్లు

ఎల్ఐసి కార్యాలయంలో వాటర్ కూలర్ ఏర్పాటు

ప్రజాశక్తి - భీమడోలు

భారత జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి) స్థానిక శాటిలైట్ కార్యాలయంలో ఖాతాదారులు, ఏజెంట్ల కోసం వాటర్ కూలర్‌ను మేనేజర్ నిమ్మగడ్డ భువనదీప సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భువన దీపకు ఏజెంట్స్ అసోసియేషన్ (సిఐటియు) భీమడోలు శాఖ అధ్యక్షుడు కమ్మెల సుబ్బారావు కృతజ్ఞతలు తెలిపి అభినందించారు. బుధవారం స్థానిక ఎల్ఐసి కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో తాగునీటి సమస్య పరిష్కారం నిమిత్తం మేనేజర్ వాటర్ కూలర్‌ను ఏజెంట్లకు బహూకరించారు. ఏజెంట్ల సమస్యలను అర్థం చేసుకుని సొంత నిధులతో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయడం ఆదర్శనీయమని జగన్మోహన్‌రావు అభివర్ణించారు. మేనేజర్‌తో కేక కట్ చేయించి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ఎల్ఐసి ఎఒఐ కార్యదర్శి టి.శ్రీనివాసరావు, కోశాధికారి సిహెచ్.హనుమంతురావు, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది, ఏజెంట్లు, ఖాతాదారులు పాల్గొన్నారు.



వాటర్ కూలర్‌ను సమకూర్చిన మేనేజర్ భువనదీప



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వక్తలు

స్వచ్ఛభారత్ వాకర్స్ వెల్ఫేర్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మానవ సేవే మాధవ సేవ అనే నినాదంతో గత పదేళ్ల నుంచి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్వచ్ఛభారత్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం బుధవారం ఏలూరు వంపుల చెరువు వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ వ్యవస్థాపకులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అసోసియేషన్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని, సభ్యులందరూ సహకరించాలని చెప్పారు. మహాశివరాత్రి పండుగ రోజు బలివే వద్దే యాత్రికులకు పులిహోర, మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు పదేళ్ల నుంచి అందిస్తున్నామని తెలిపారు. ఆరిలేక సంస్థలో ఉన్న పిల్లలకు పౌష్టికాహారం, దొండపాడు డెఫ్, డం సంస్థలో ఉన్న పిల్లలకు ఆర్థిక సహాయం అందించినట్లు చెప్పారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ, స్వచ్ఛభారత్ వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా కట్టూరి చంద్రశేఖర్, చేబూరి వెంకటేశ్వరరావు, కోశాధికారిగా ఎస్.భాస్కరరావు, గౌరవ అధ్యక్షులుగా మద్దాప్రోలు వెంకటేశ్వరరావు, కట్ల ఈశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వైఎస్.కనకరావు, ఉపాధ్యక్షులుగా బి.లక్ష్మణరావు, చిదరబోయిన శ్రీనివాసరావు, పసుపులేటి సత్యనారాయణ, సహాయ కార్యదర్శులుగా కాపా పాండురంగారావు, కొండేటి పోతురాజు, తలారి రాము, మరో ఆరుగురు కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

టిడిపి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

టిడిపి నూతన క్యాలెండర్ను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు బుధవారం ఆవిష్కరించారు. మండలం లోని రాజుపోతేపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచి,



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న టిడిపి నేతలు

టిడిపి నాయకులు దావులూరి సూర్యనారాయణ, టిడిపి పోలవరం ఎస్సి సెల్ అధ్యక్షులు చిలకా బాలయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాలెండర్ను వెంకటేశ్వరరావు వీరభద్రవరం గ్రామంలోని ఆయన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తోట లక్ష్మీనారాయణ, గంధిసెట్టి శ్రీను, సామాజిక కార్యకర్త లంకా జయబాబు, పేరుబోయిన శ్రీను, వాసిరెడ్డి రామ్మోహన్, సంధిపూడి సాయి, చిలకా బాలయ్య, చిలకా సుబ్బు, దావులూరి సూర్యనారాయణ, కలిశెట్టి పార్థసారధి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు



దగ్ధమైన వరి కుప్ప

వరి కుప్ప దగ్ధం

రైతు కన్నీరుమున్నీరు

ప్రజాశక్తి - చింతలపూడి

వరి కుప్పకు నిప్పంటుకుని దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని అకంపాలెం గ్రామానికి చెందిన నందిపం మారేషు రామరాజకుంట వద్ద 1.30 ఎకరంలో వరి పంట పండించి కుప్ప వేశాడు. ఆ కుప్పకు బుధవారం సాయంత్రం మంటలు అంటుకున్నాయి. ఇది గమనించిన అక్కడివారు రైతుకు సమాచారం ఇచ్చారు. రైతు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఫైర్ స్టేషన్కి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే వరి కుప్ప 90 శాతం దగ్ధమైంది. వరి కుప్ప మంటల్లో దగ్ధమవ్వుతుంటే రైతు గుండెలు బదుకొని కన్నీరుమున్నీరయ్యాడు. ప్రమాదానికి కారణం తెలియాల్సి ఉంది.



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన తాటాకిళ్లు

సింగనపూడిలో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - మండవల్లి

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయిన సంఘటనలో తాటాకిల్లు దగ్ధమై బాధితుడు కట్టుబట్టలతో మిగిలిపోయిన సంఘటన మండలంలోని సింగనపూడిలో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన అమ్మతులూరి వీరభద్రరావు వడ్రంగి పనులు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అతని భార్య మృతి చెందగా ఇద్దరు కుమార్తెలు, కుమారుడికి వివాహమై గుడివాడ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. అయితే వీరభద్రరావు గ్రామంలో ఒంటరిగానే ఉంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం సుమారు ఒంటి గంట సమయంలో వీరభద్రరావు ఇంట్లో ఉండగా మీటర్ల దగ్గర నుంచి పెద్దగా శబ్దాలు వస్తూ మంటలు వ్యాపించి ఒకసారిగా ఇంటికి నిప్పంటుకుని దట్టమైన పొగలు వచ్చాయి. ఇది గమనించిన స్థానికులు హుటాహుటిన అక్కడికి చేరుకుని వీరభద్రరావును బయటకు తీసుకొచ్చి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. మంటలు దట్టంగా అలుముకోవడంతో తాటాకిల్లు క్షణాల్లో అగ్నికి ఆహుతి అయిపోయింది. ఈ మంటల్లో వీరభద్రరావుకు చెందిన వడ్రంగి పనులు నిర్వహించే సాయగ్రి, టేకు, కలప, రేషన్, ఆధార్ కార్డ్తో పాటు మంచం, బీరువాలోని రూ.50 వేల నగదుతో పాటు ఇంట్లో ఉన్న సామగ్రి కాలి బూడిదయ్యాయి. దీంతో వీరభద్రరావు కట్టుబట్టలతో మిగిలిపోయాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని రూ.రెండు లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు అంచనాలను రూపొందించినట్లు స్థానికులు తెలిపారు.

చీమల మందు తిని వ్యక్తికి అస్వస్థత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మద్యం మత్తులో చీమల మందు తిని వ్యక్తి అస్వస్థతకి గురైన ఘటన మండలంలోని వంకవారిగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... వంకవారిగూడెం గ్రామానికి చెందిన బాలకృష్ణ మద్యం మత్తులో ఇంట్లో ఉన్న చీమల మందు తిని అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి అతనిని జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

బాబోయ్ కుక్కలు..!

గ్రామాల్లో విచ్చలవిడిగా వీధి కుక్కల స్వైరవిహారం
వాహనదారులపై దాడులు
భయాందోళనలో ప్రజలు
పట్టించుకోని పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి -ముదినేపల్లి

మండలంలోని అన్ని గ్రామాల్లో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. వీధి కుక్కల బెడదలతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. కుక్కలు గుంపులుగుంపులుగా రోడ్లపై తిరుగుతూ ప్రజలపై, వాహనదారులపై దాడులకు పాల్పడుతున్నాయి. వీధి కుక్కల దాడితో నిత్యం మండలవ్యాప్తంగా అనేకమంది క్షతగాత్రులుగా మారుతున్నారు. దీంతో వీధుల్లోకి చిన్నారులను పంపాలంటే తల్లిదండ్రులు భయపడే పరిస్థితులు మండలంలో నెలకొన్నాయి. కుక్కలు గ్రామంలోని అంతర్గత రోడ్లపై, రహదారులపై రాకపోకలు సాగించే ప్రజలను, ద్విచక్ర వాహనదారులను వెంబడిస్తూ వారిపై దాడి చేస్తూ గాయపరుస్తున్నాయి. వీధికుక్కలు ద్విచక్ర వాహనదారుల వెంట పడడంతో కంగారులో బైకులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. వీటితో కలుగుతున్న ఇబ్బందులపై పంచాయతీ పాలకవర్గాలకు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ పట్టించుకోవడంలేదని ప్రజల నుంచి విమర్శలు వినపడుతున్నాయి. ముఖ్యంగా మండలంలోని ఊటుకూరు గ్రామంలో ఈ కుక్కల బెడద మరింత ఎక్కువగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన వ్యక్తి పెంపుడు కుక్కను బయటకు వదిలివేయడంతో రహదారిపై వెళ్లే ద్విచక్ర వాహనదారులపై ఆ కుక్క దాడి చేసి గాయపరిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయం కుక్క యజమాని దృష్టికి తీసుకువెళ్లగా "మీకు చేతనైంది చేసుకోండి" అంటూ సదరు వ్యక్తి సమాధానం చెబుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయం సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. కుక్క కాటుకు గురైన వ్యక్తులు మండలంలోని దేవపూడి, గురజ, ముదినేపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో వీధి కుక్కలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు మండల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని మండల ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.



పోలవరంలో వీధి కుక్కలు

ఊరకుక్కల సంచారం... భయాందోళనలో ప్రజానీకం

పోలవరం :పోలవరం మండల కేంద్రంలో ఊర కుక్కలు మందలు మందలుగా తిరుగుతూ స్వైర విహారం చేస్తూ ప్రజానీకాన్ని భయాందోళనలకు గురి చేస్తున్నాయి. పోలవరంలో స్థానిక ఏటిగట్టు సెంటర్ నుంచి పంచాయతీ కార్యాలయం వరకూ రోడ్డుకు ఇరువైపులా ఉన్న చికెన్ షాపుల వద్ద కుక్కలు



ముదినేపల్లిలో కుక్కల స్వైరవిహారం

గుంపులుగా చేరి రాకపోకలు సాగించే ప్రయాణికులు, వ్యాపారులు వాహనదారులు, విద్యార్థులు, పసిపిల్లలు, వృద్ధులపై దాడులకు తెగబడుతున్నాయి. పెరటి కోళ్లు, మేకలు, లేగదూడలపై దాడులకు పాల్పడి చంపుకు తింటున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చికెన్ షాపుల వల్లే ఊరకుక్కల సంచారం దాడులు జరుగుతున్నాయని, అధికారులు స్పందించి చికెన్ షాపులను మార్కెట్లో ఏర్పాటు చేసిన కబేళా షెడ్డులోకి తరలించాలని, కుక్కలను పట్టించి దూరంగా వదిలిపెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

స్వైరవిహారంతో ప్రజలు బెంబేలు

కుక్కునూరు :మండలంలో ఎటుచూచినా వీధి కుక్కలు సైర్య విహారం చేస్తూ బెంబేలెత్తిస్తున్నాయి. చికెన్ షాపుల వద్ద, ప్రధాన రహదారులు, హై స్కూల్, బస్టాండ్ వరకు ఎక్కడా చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులను వెంబడిస్తూ దాడికి పాల్పడుతున్నాయి. వాటి నుంచి రక్షించుకునే ప్రయత్నంలో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. మరోవైపు స్కూల్ విద్యార్థులు, వృద్ధులు, మహిళలు రోడ్లపైకి రావాలంటే వణికిపోతున్నారు. దీనికి తోడు ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన కుక్కలను సైతం కుక్కునూరు పట్టణంలో వదిలి వెళ్లడంతో కుక్కలు అధికంగా ఉంటున్నాయి. ఏ వీధిలో చూసినా, ఏ మార్గంలోకి వెళ్లినా కుక్కలు దర్శనమిస్తున్నాయి. చిన్నారుల వెంటపడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కుక్కలను పట్టి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



నూజివీడులో...

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నూతన సంవత్సరం సందర్భంగా యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఎంఇఒ-1 రవిప్రకాష్, ఎంఇఒ-2 డివి.రమణలు వారి కార్యాలయంలో కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఆర్టిసి జోనల్ ఛైర్మన్, జనసేన నియోజకవర్గ ఇన్ఛార్జి రెడ్డి అప్పలనాయుడుతో కేక్ కట్ చేయించారు. ఏలూరు ఎంపిడిఒ వి.శ్రీలతకు యుటిఎఫ్ మండల శాఖ పక్షాన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి 2025 నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్ను బహుకరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి, ఏలూరు మండల శాఖ ఇన్ఛార్జి నంబూరి రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి ఎల్.కనకదుర్గ, సహాధ్యక్షురాలు ముకుంద లక్ష్మి, కోశాధికారి ఎ.స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణ పరిధిలో నూతన సంవత్సర వేడుకలు బుధవారం నిర్వహించారు. పట్టణంలోని ద్వారకా ఎస్టేట్స్ ఆవరణలో మాజీ ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. టిడిపి సీనియర్ నేత నూతక్కి వేణుగోపాలరావు, భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్సింగ్ చిత్రపటానికి టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు, కీర్తిశేషులు ఎన్టి.రామారావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అభిమానులకు అల్పాహారం అందించారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ముద్రబోయిన వెంకటేశ్వరరావు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసే స్వీట్లు పంపిణీ చేశారు. ఆత్మీయులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్సింగ్ మృతి అనంతరం సంతాప దినాలు కొనసాగుతున్న నేపథ్యంలో అధికారికంగా వేడుకలను నిర్వహించలేదు.

కొయ్యలగూడెం :మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజలు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్త సంవత్సరం సందర్భంగా ఆలయాల్లో హరినామ కీర్తనలు, ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. చర్చిలు కూడా ప్రత్యేక ప్రార్థనలతో కిక్కిరిశాయి. మరోవైపు రాజకీయ నాయకుల నివాసాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ప్రజలు, కార్యకర్తలు, నాయకులను సందర్శించి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అయితే నూతన సంవత్సర వేడుకల వెనుక కొన్ని వివాదాస్పద సంఘటనలూ చోటు చేసుకున్నాయి. పలు గ్రామాల్లో అనుమతులు లేకుండానే కోడిపందేలు చట్టవిరుద్ధంగా నిర్వహించారు. 31వ రాత్రి చాలా ప్రాంతాల్లో పెద్దఎత్తున సంబరాలు జరిగాయి. అయితే, కొన్ని ప్రాంతాల్లో ఘర్షణలు కూడా చోటు చేసుకున్నాయి. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

ఆనందోత్సాహాలతో వేడుకలు

టి.నరసాపురం :మండ లంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి నుంచి ప్రారంభమైన వేడుకల్లో క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పల్లెల్లో ఇళ్ల వద్ద నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ రంగవల్లులు వేసి అలంకరించారు. ప్రధానంగా మండలంలోని అప్పలరాజుగూడెం, మక్కినవారిగూడెం, మర్రిగూడెం, పుట్రేపు, ప్రకాష్నగర్, గండిగూడెం, సీతంపేట, టి.నరసాపురం, బొర్రంపాలెం తదితర గ్రామాల్లోని ప్రార్థనాలయాల్లో తోటి వారికి స్వీట్లు, పండ్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రపంచ శాంతి కోసం, ప్రజలందరి క్షేమం కోసం పాస్టర్లు, క్రైస్తవ విశ్వాసులు ప్రార్థనలు చేశారు. పేదలకు చీరలు దుప్పట్లు పంపిణీ చేశారు, సహపంక్తి భోజనాలు నిర్వహించారు. నాయకులు, అధికారులు ప్రజాప్రతినిధులకు పూలబొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో జి.జ్ఞాన్రాజు, కె.నిరీక్షణరావు, సి హెచ్.హెూషేయ, వై.పాల్చిన్నారావు, రమేష్, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : ముదినేపల్లిలో నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంపిపి



ముదినేపల్లిలో...

రామిశెట్టి సత్యనారాయణ కార్యాలయంలో వైసిపి నాయకులు కేక్ కట్ చేశారు. ఎంపిపి సత్యనారాయణ మండల ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాది అందరికీ శుభం కలగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ముదినేపల్లి మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, మండల పరిషత్ అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముసునూరు :నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని 16 గ్రామాల్లో తెల్లవారుజాము నుంచే క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజలంతా ఆనందంతో ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. హిందువులు ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలి



ఉంగుటూరు :ఎంఎల్ఎకు మహిళల శుభాకాంక్షలు

ప్రజాశక్తి - చింతలపూడి

నూతన సంవత్సరంలో ప్రజలందరూ చైతన్యవంతులై మంచి నిర్ణయాలతో వృత్తిపరంగా, వ్యక్తిగతంగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్కుమార్ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వద్ద ఆయనను బుధవారం పలువురు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నాలుగు మండలాల నాయకులతో పాటు ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, యుటిఎఫ్ చింతలపూడి మండల శాఖ, పిఆర్టియు మండల శాఖ టిడిపి, జనసేన, బిజెపి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు, ప్రజలు వేలాదిగా తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.


ఎంఎల్ఎ ధర్మరాజుకు పలువురి శుభాకాంక్షలు

ఉంగుటూరు : ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు పోటెత్తారు. బుధవారం నారాయణపురంలో ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పెన్నులు, పుస్తకాలను ఎంఎల్ఎకు ఇచ్చి అభినందనలు తెలిపారు. వచ్చినవారికి భోజన ఏర్పాట్లు క్యాంపు కార్యాలయం చేసింది. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఎంపిపికి పలువురి శుభాకాంక్షలు

ఉంగుటూరు ఎంపిపి గంటా శ్రీలక్ష్మిసుబ్బారావులకు మండలంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, కాంట్రాక్టర్లు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎంపిడిఒ జి.రాజ్మనోజ్, కార్యాలయం ఎఒ ఆంజనేయులు, ఐసిడిఎస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ :ఎపిఎస్ ఆర్టిసి విజయవాడ జోనల్ ఛైర్మన్, జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్ఛార్జి రెడ్డి అప్పలనాయుడు ఇంటి వద్ద నూతన సంవత్సర వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి పలువురు ఆర్టిసి ఉన్నతాధికారులు, పలు సంఘాల నాయకులు, మార్కెట్ యార్డ్ యూనియన్ నాయకులు, అన్ని పార్టీల అభిమానులు, నాయకులు రెడ్డి అప్పలనాయుడును మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు, శ్రామికవర్గానికి, కార్మిక వర్గానికి, రైతు సోదరులకు, వ్యాపార వర్తక సోదరులకు ఉద్యోగస్తులకు, ఎన్జిఒ సంఘాలకు ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు. 2025లో అందరూ ఆనందంగా, సంతోషంగా జీవించాలని, రాష్ట్రం మరింత అభివృద్ధి



ఏలూరు సిటీ : రెడ్డి అప్పలనాయుడుకు మహిళల శుభాకాంక్షలు

చెందాలని చెప్పారు. ఉద్యోగ కల్పన, మౌలిక వసతులు, ఇండస్ట్రీలు అన్ని రంగాలు అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు డివిజన్ల నుంచి జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

గ్రామసభల నిర్వహణతోనే గ్రామాలభివృద్ధి

షెడ్యూల్ విడుదల చేసిన ఎంపిడిఒ రామలింగేశ్వరరావు

ప్రజాశక్తి - మండవల్లి

గ్రామ సభల నిర్వహణ ద్వారానే గ్రామాలాభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపిడిఒ రామలింగేశ్వరరావు తెలిపారు. మండలంలో నిర్వహించే గ్రామసభ షెడ్యూల్ ఆయన బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల రెండో తేదీ నుంచి ఏడో తేదీ వరకు మండవల్లి మండలంలో గ్రామ సభలను నిర్వహిస్తున్నామన్నారు. రెండో తేదీన చింతపండు పెరిగేగూడెం, కొర్లపాడు, భైరవపట్నం గ్రామాల్లో, మూడో తేదీన గన్నవరం, కొవ్వాడలంక, మణుగూరు, ఉనికిలి, ప్రత్తిపాడు, తక్కెళ్లపాడు, నిచ్చిమిల్లి, మూడుతాలపాడు గ్రామాల్లో, ఆరో తేదీన ఇంగిలంపాకలంక, మండవల్లి, ముఖాస కలవపూడి, చింతలపూడి, పసలపూడి, కానుకొల్లు, లింగాల, సింగనపూడి, పొట్లచెరువు గ్రామాల్లో, ఏడో తేదీన నందిగామలంక, పెనుమాకలంక, లోకుమూడి, అప్పాపురం గ్రామాల్లో గ్రామసభలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ గ్రామసభలను విజయవంతంగా నిర్వహించాలని ఆయా గ్రామాల కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. అంతేకాకుండా గ్రామసభలు సక్రమంగా నిర్వహించేందుకు నిర్వహణ అధికారులను కూడా నియమించినట్లు తెలిపారు. గ్రామాల్లోని ప్రజలు గ్రామ సభలో పాల్గొని గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకుని గ్రామాభివృద్ధికి బాటలు వేసుకోవాలని ఆయన తెలిపారు.

బాలసదన్ను సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

కలెక్టర్ కె.వెట్రిసెల్వికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయటానికి వచ్చి కలిసిన ప్రముఖులందరూ అందించిన నోట్ బుక్స్, పెన్సిల్స్, స్కేల్స్, కలర్ పెన్సిల్స్, పెన్నులు, పిల్లలకు అవసరమైన వస్తువులను దెందులూరు బాలసదన్లోని బాలలందరికీ కలెక్టర్ బుధవారం అందించారు. వారితో కలిసి ఆటలాడి బాలలందరిలోనూ నూతన సంవత్సరంలో కొత్త శోభను సంతరించుకునే విధంగా సంతోషాన్ని, వెలుగులను నింపారు. వారందరికి జిల్లా కలెక్టర్గా భరోసాని కల్పించారు. అనంతరం కలెక్టర్ వెట్రి సెల్వి పిల్లలతో చెస్ ఆడి, యోగాసనాలు నేర్పించడం, పాటలు పాడించడం, డాన్సులు వేయించి తిలకించారు. చదువుల్లో వారు సాధిస్తున్న ప్రగతి, ఆరోగ్య భద్రత, వారికి అందిస్తున్న ఆహార మెనూ వివరాలను, ఇతర సౌకర్యాలన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించి బాలసదన్ సూపరింటెండెంట్కు తగు సూచనలు ఇచ్చారు. తనకు ఏమాత్రం విరామం దొరికినా చిన్నారులతో గడిపేందుకు ప్రయత్నిస్తానని, వారితో గడిపి ఆనందం పొందుతానని కలెక్టర్ తెలిపారు. బాలసదన్లో ఉన్న ఇద్దరు చిన్నారుల పుట్టనరోజు పురస్కరించుకుని వారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి కొత్త దుస్తులు అందించారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించి ఉన్నతమైన స్థానానికి ఎదగాలని ఆమె పిల్లలకు ప్రభోధించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్తో పాటు దెందులూరు తహశీల్దార్ బి.సుమతి, జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి పి.శారద, జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సిహెచ్.సూర్యచక్రవేణి, బాలసదన్ సూపరింటెండెంట్ ఎస్.బేబీసరోజిని, బాలసదన్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్కు ఎస్పి, జెసి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - ఏలూరు

ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ వెట్రిసెల్విని ఎస్పి కె.ప్రతాప్శివకిషోర్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా కలెక్టర్ను నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ్రాజ్ మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు విశేష కృషి చేస్తున్న ఎస్పి కె.ప్రతాప్శివకిషోర్ను ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి అభినందించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలు ప్రతిఒక్కరికీ అందించడమే లక్ష్యంగా ప్రణాళిక బద్ధంగా అధికారులంతా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు.

5 నుంచి యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

కాకినాడ నగరంలో ఈ నెల 5, 6, 7, 8 తేదీల్లో నిర్వహించనున్న ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవ మహాసభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు కోరారు. నూజివీడులో ఆయన బుధవారం మాట్లాడుతూ బతకలేని స్థాయి నుంచి బతకగలిగిన స్థితికి ఉపాధ్యాయుల పరిస్థితులను మెరుగుపరచడం పోరాటాలతో సాధ్యమైందన్నారు. మహాసభలో ఉపాధ్యాయులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నాటుసారాపై ఉక్కుపాదం

డిసెంబర్లో 41 కేసులు నమోదు

ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్య

ప్రజాశక్తి నూజివీడు టౌన్

గత నెలలో నూజివీడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో జరిపిన దాడుల్లో మొత్తం 41 కేసులు నమోదు చేశామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్య బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అందులో 35 నాటుసారా కేసులు నమోదు చేసి 26 మంది నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 369 లీటర్ల నాటు సారా, నాటు సారా రవాణాకు ఉపయోగించిన ఆరు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 12510 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి మూడు బెల్ట్ షాపు నిర్వాహకులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే కల్లులో కల్తీ జరగకుండా ఉండేందుకు మూడు కల్లు శాంపిల్స్ తీశామని తెలిపారు. 57 మంది పాత నిందితులను ఒక సంవత్సరం కాల పరిమితితో నాలుగు మండలాల తహశీల్దారు ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది కాల పరిమితిలో వారు మళ్లీ నేరాలకు పాల్పడితే రూ.లక్ష జరిమానా, ప్రభుత్వం అందించే పథకాలను రద్దు పరుస్తారని పేర్కొన్నారు.

3న సత్రంపాడులో జాబ్మేళా

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో సత్రంపాడులోని ప్రభుత్వ ఐటిఐ కళాశాల (స్కిల్ హబ్)లో ఈ నెల మూడో తేదీ శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.జితేంద్రబాబు తెలిపారు. ఈ జాబ్మేళాలో ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్నోవా సోర్స్, వరుణ్ మోటార్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. అలాగే సుమారు 120 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ జాబ్మేళాకు పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు ఉండి 18 నుంచి 30 సంవత్సరాల వయసు గల వారు అర్హులని తెలిపారు. వివరాలకు 8978524022, టోల్ ఫ్రీ నెంబర్ 9988853335 సంప్రదించవచ్చని తెలిపారు. ఈ జాబ్మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయడేటా, సర్టిఫికెట్స్ నకలతో హాజరు కావాలని పేర్కొన్నారు.